ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
జయశంకర్ భూపాలపల్లి
గురువారం 17 జూలై 2025




ఇచ్చంపల్లి వద్ద గోదావరి నదిలో గత ప్రాజెక్టు ఆనవాళ్లు

మళ్లీ ఇచ్చంపల్లి..

7లో

- తెరపైకి బహుళార్థ సాధక ప్రాజెక్టు అంశం
- 17 ఏళ్ల తర్వాత మరోసారి ప్రతిపాదన
- కేంద్రానికి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి లేఖ
- బనకచర్ల ప్రాజెక్టు వివాదం నేపథ్యంలో సర్కారు చర్యలు
- మేడిగడ్డ బ్యారేజీ ఉనికి ప్రశ్నార్థకమే..?
- 159 ఏళ్ల క్రితం నిజాం కాలంలోనే ఇచ్చంపల్లి ప్రాజెక్టుకు పునాది

శతాబ్దిన్నర కిందటి ఇచ్చంపల్లి ప్రాజెక్టు నిర్మాణ అంశం మళ్లీ తెరపైకి వచ్చింది. వైఎస్ హయాంలో ప్రతిపాదనలకు నోచుకున్న ఈ ప్రాజెక్టు... 17 ఏళ్ల తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం మళ్లీ ఇప్పుడు ప్రస్తావించడం చర్చనీయాంశమైంది. గోదావరి-కావేరి నదుల అనుసంధానం కోసం రిజర్వాయర్ కడతామంటున్న కేంద్రానికి రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి లేఖ రాయడం, ఇచ్చంపల్లి ప్రాజెక్టు నిర్మాణ అంశాన్ని పరిశీలించాలని కోరడంతో ఇది తెరపైకి వచ్చింది. బనకచర్ల వివాదం నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చంపల్లి వద్ద గోదావరి-కావేరి నదుల అనుసంధానానికి ఈ మేరకు ప్రతిపాదించింది. అయితే.. ఇచ్చంపల్లి ప్రాజెక్టు వల్ల కాళేశ్వరం భవిష్యత్తు ప్రశ్నార్థకం కానుందని తెలుస్తోంది. కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం చేసిన ఈ ప్రతిపాదనలకు ఆమోదముద్ర వేస్తే ఇచ్చంపల్లి వద్ద 100మీటర్ల ఎత్తుతో జలాశయ నిర్మాణం జరుగుతుంది. దీంతో లక్ష కోట్లు ఖర్చు చేసి నిర్మించిన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల భవిష్యత్తు ఏమిటనే చర్చ మొదలైంది.

-ఆంధ్రజ్యోతి, భూపాలపల్లి

అభివృద్ధి పథంలో నడుస్తున్నాం..

- ములుగు జిల్లాను ముందు వరుసలో నిలబెడతాం
- సంక్షేమ ఫలాలు అందరికీ అందేలా కృషి చేస్తున్నాం
- పర్యాటక, ఆధ్యాత్మిక కేంద్రాలపై ప్రత్యేక దృష్టి పెట్టాం
- ములుగు కలెక్టర్ దివాకర



ఇంటర్వ్యూ

ములుగు, జూలై 16(ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లాను అభివృద్ధి పథంలో నడపడమే తన ధ్యేయమని అన్నారు కలెక్టర్ దివాకర. ప్రజా సంక్షేమాన్ని సంపూర్ణంగా అమలు చేసే దిశగా ముందుకు వెళ్తున్నట్టు తెలిపారు. పర్యాటక, విద్య, వైద్య, రవాణా రంగాల్లో మరింత ముందుకు తీసుకెళ్లేందుకు శాయశక్తులా కృషి చేస్తూనే ఉంటానన్నారు. కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టి ఏడాది పూర్తయిన సందర్భంగా 'ఆంధ్రజ్యోతి'కు ఇచ్చిన ఇంటర్వ్యూలో దివాకర మాట్లాడారు.

ప్రశ్న: మీరు బాధ్యతలు చేపట్టిన సంవత్సర కాలంలో మీరు తీసుకున్న చర్యలు ఏమిటి?

జవాబు: ములుగు జిల్లా అటవీ ప్రాంతం. ఇక్కడ జియోగ్రాఫికల్‌గా ఎన్నో చాలెంజెస్ ఎదుర్కొన్నాను. ఈ ప్రాంతంలో ఆదివాసీ, గిరిజన ప్రజలు ఎక్కువగా జీవిస్తుంటారు. సరైన వైద్య అందక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిసి తాడ్వాయి, కన్నాయిగూడెం మండలాల్లో కంటైనర్ ఆస్పత్రులను ఏర్పాటు చేయించాం. ప్రధానంగా మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో వర్షాలు కురిసినప్పుడు, రామప్ప, లక్నవరం చెరువుల్లోకి నీళ్లు వచ్చినప్పుడు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాం.

ప్రశ్న: పర్యాటక అభివృద్ధికి మీరు చూపుతున్న చొరవ ఏమిటి?

జవాబు: పర్యాటకానికి ములుగు జిల్లా పెట్టింది పేరు. తాడ్వాయి మండలంలో బ్లాక్ బెర్రీ ఐలాండ్ (మిగతా 8వ పేజీలో)

టీబీ నిర్మూలనకు కృషి చేయాలి

కలెక్టర్ రాహుల్‌శర్మ


మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌శర్మ

భూపాలపల్లి కలెక్టరేట్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): టీబీని సమూలంగా నిర్మూలించేందుకు కృషి చేయాలని కలెక్టర్ రాహుల్‌శర్మ అన్నారు. కలెక్టరేట్‌లో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన టీబీ ముక్త్ భారత్ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో టీబీని వ్యాధిని నిర్మూలించడంలో ప్రైవేటు వైద్యుల సహకారం ఎంతో అవసరమన్నారు. జిల్లాలో 95వేల మందికి టీబీ పరీక్షలు చేయడం లక్ష్యం కాగా ఇప్పటి వరకు 1,695 మందికి నిర్వహించామన్నారు. జూన్ 9న ప్రారంభమైన టీబీ పరీక్షలను 100 రోజుల్లో 95వేల మందికి పరీక్షలు పూర్తి చేయనున్నట్లు తెలిపారు. టీబీ నిర్ధారణలో ఎక్స్‌రే, నాట్ పరీక్షలు చేయాల్సి ఉంటుందన్నారు. జిల్లాలోని ఐదు ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఎక్స్‌రే కేంద్రాలున్నాయని ఉన్నాయని తెలిపారు. గుర్తించిన కేసులను నిక్షేపణ యాప్‌లో నమోదు చేయాలన్నారు. ప్రైవేటు ఆస్పత్రుల్లో చికెన్ గున్యా, మలేరియా, టైఫాయిడ్ సోకిన వ్యక్తుల వ్యక్తుల సమాచారం వైద్యఆరోగ్యశాఖ అధికారులకు అందజేయాలన్నారు. సమావేశంలో జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ నవీన్, మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో శ్రీదేవి, ప్రైవేటు ఆస్పత్రుల నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

మొక్కలను విరివిగా నాటాలి

భూపాలపల్లి ఎస్పీ కిరణ్‌ఖరే


మొక్కలు నాటి నీరు పోస్తున్న ఎస్పీ కిరణ్‌ఖరే

కృష్ణకాలనీ, జూలై 16 (ఆంధ్రజ్యోతి): సమాజంలోని ప్రతి ఒక్కరూ మొక్కలను విరివిగా నాటాలని ఎస్పీ కిరణ్‌ఖరే అన్నారు. జిల్లా కేంద్రంలోని పోలీసు కార్యాలయంలో వన మహోత్సవ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. పోలీసు అధికారులు, సిబ్బంతో కలిసి ఎస్పీ మొక్కలు నాటి నీరు పోశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిషత్ తరాల మనుగడే వన మహోత్సవ కార్యక్రమ లక్ష్యమన్నారు. అన్ని పోలీస్‌స్టేషన్లలో పెద్ద ఎత్తున మొక్కలు నాటాలని ఆదేశించారు. ప్రకృతికి సౌందర్యం మొక్కలేనని, పర్యావరణ పరిరక్షణకు మొక్కలు ఎంతో దోహదం చేస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎనరేష్‌కుమార్, వర్టికల్ డీఎస్పీ నారాయణ నాయక్, జిల్లా పరిధిలోని సీఐలు, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బాల కార్మికుడికి విముక్తి

కాటారం, జూలై 16(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ ముస్కాన్‌లో భాగంగా బాల కార్మికులను గుర్తించే కార్యక్రమాన్ని సంబంధిత అధికారులు మండలంలో బుధవారం చేపట్టారు. జిల్లా సహాయ కార్మిక అధికారి వినోద నేతృత్వంలో ఎస్సై ఓం పాల్ ఆధ్వర్యంలో సిబ్బంది పలు ప్రాంతాల్లో తిరిగి తనిఖీలు చేపట్టారు. చింతకాని గ్రామంలో వాటర్ ప్లాంట్ ట్రాలీఆటో నడుపుతున్న 16ఏళ్ల బాలుడిని గుర్తించారు. బాలకార్మికుడి చేత పనిచేయించుకుంటున్న యజమానిపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఏఎల్‌వో వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సామాజిక కార్యకర్త లింగారావు, కాటారం ఏఎస్సై సుధీర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పల్లెలకు స్వచ్ఛ కీర్తి



భూపాలపల్లిటౌన్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): దేశాభివృద్ధికి పల్లెలే పట్టుకొమ్మలు. గ్రామీణ ప్రాంతాలు పురోగతి వైపు పయనిస్తేనే దేశాభివృద్ధి సాధ్యం. కేంద్ర ప్రభుత్వం ఇదే దృక్పథంతో స్వచ్ఛ సర్వేక్షన్ మిషన్ పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. ప్రభుత్వ పథకాల అమలు, వివిధ అభివృద్ధి పనులు, గ్రామ పురోభివృద్ధిలో ప్రతిభ కనబరిచిన పంచాయతీలను ఎంపిక చేస్తోంది. ఉత్తమ పంచాయతీలకు ఏటా స్వచ్ఛ పురస్కారాలను అందిస్తోంది. ఇలా ఉత్తమ పంచాయతీలుగా ఎంపిక చేసేందుకు ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా సర్వే జరుగుతోంది. మొత్తం 20 గ్రామ పంచాయతీలు ఈ సర్వేల కోసం ఎంపిక కాగా వీటి నుంచి ఉత్తమంగా నిలిచిన వాటికి పురస్కారాలు అందనున్నాయి. ఈ ఏడాది ఉత్తమ పంచాయతీల ఎంపిక కోసం అధికారుల బృందాలు ఇప్పటికే క్షేత్రస్థాయి పరిశీలను ప్రారంభించాయి.

- ఆదర్శ గ్రామాల ఎంపికకు కసరత్తు
- జిల్లాలో 20 పంచాయతీల్లో సర్వేలు
- వివిధ అంశాలను పరిగణనలోకి తీసుకొని పురస్కారాలు

10 పంచాయతీల్లో సర్వే పూర్తి

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 248 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వాటిలో 20 పంచాయతీలను సర్వే కోసం ఎంపిక చేశారు. వీటిలో ఇప్పటికే 10 గ్రామపంచాయతీలను పరిశీలించి సర్వేలు పూర్తి చేశారు. భూపాలపల్లి, కాటారం, మహదేవపూర్, మహాముత్తారం మండలాల్లో రెండు చొప్పున గ్రామ పంచాయతీలను ఎంపిక చేసి ఇప్పటిఏ సర్వే పూర్తి చేశారు. మరో 20 గ్రామ పంచాయతీల్లో ఇది కొనసాగనుంది.

పరిశీలించే అంశాలు ఇవే..

ప్రధానంగా గ్రామాల్లో పరిశుభ్రత ఎలా ఉంది.. జన ఆవాసాల వద్ద మరుగుదొడ్లు పూర్తి స్థాయిలో ఉన్నాయా? అని సర్వే బృందం పరిశీలిస్తుంది. తడి, పొడి చెత్త వేర్వేరుగా చేస్తున్నారా? ట్రాక్టర్‌లో వేర్వేరుగా తరలించేందుకు ఏర్పాట్లు చేశారా? అని గమనిస్తారు. అలాగే ఇంకుడు గుంతలు, ఇంటి పరిసరాల పరిశుభ్రత చిత్రాలు తీసి యాప్‌లో అప్‌లోడ్ చేస్తారు. కంపోస్ట్ షెడ్, తాగునీటి సరఫరా, పారిశుధ్య కమిటీ ఖాతాలను పరిశీలిస్తారు. తడిపొడి చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాల అమ్మకం ద్వారా పంచాయతీకి ఎంత ఆదాయం సమకూరుతుందనే వివరాలను సేకరిస్తారు. ఉపాధి హామీ పథకం జాబ్‌కార్డులు ఎవరెవరికి ఉన్నాయి.. ఎంత మేరకు పనులు చేస్తున్నారు? అని పరిశీలిస్తారు.

అధిక మార్కులకు పురస్కారం..

గ్రామ పంచాయతీల్లో పరిశీలించే అభివృద్ధి పనుల్లో వెయ్యి మార్కులను వివిధ రకాలుగా విభజించారు. సర్వీస్ లెవల్ ప్రోగ్రామ్స్‌కు 240 మార్కులు, ప్లాంట్ల పరిశీలనకు 120 మార్కులు, స్వచ్ఛ పరిస్థితి పరిశీలనకు 540, పౌరుల అభిప్రాయాలు 100మార్కులు కేటాయించారు. గ్రామంలో 16 నివాసాలను ఎంపిక చేసుకుని వాటిలో మూడు ఎస్సీ, మూడు ఎస్టీ, ఎనిమిది ఇతర కుటుంబాలు, మరో రెండు నివాసాలను అధికారులు ఎంపిక చేసుకుని సర్వే చేస్తారు. ఇలా సర్వే చేసిన అనంతరం ఆ గ్రామానికి వచ్చే మార్కుల ఆధారంగా ఆదర్శ గ్రామంగా ఎంపిక చేసి కేంద్రానికి సమర్పిస్తారు. ఈ క్రమంలో ప్రభుత్వం వారికి ప్రోత్సాహకాలు అందిస్తుంది.


మహాముత్తారం మండలం ములుగుపల్లిలో సర్వే నిర్వహిస్తున్న డీఆర్‌డీపీ అధికారులు

మెనూను కచ్చితంగా పాటించాలి

కాటారం సబ్‌కలెక్టర్ మయాంక్ సింగ్


హాస్టల్ వార్డెన్‌తో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ మయాంక్‌సింగ్

మహదేవపూర్, జూలై 15(ఆంధ్రజ్యోతి) : హాస్టళ్లలో మెనూను కచ్చితంగా పాటించాలని కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్ అన్నారు. మహదేవపూర్‌లోని కేజీబీవీ పాఠశాలను సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్ బుధవారం తనిఖీ చేశారు. భోజనం మెనూ, సరుకుల స్టాక్ వివరాలు, వసతి తదితర వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. విద్యాబోధన, హాజరు రిజిస్టర్, స్టాక్ రిజిస్టర్ గురించి చర్చించారు. తర్వాత అక్కడికి వచ్చిన విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యలు ఏమైనా ఉంటే సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేయొచ్చని తెలిపారు. ఆయన వెంట డిప్యూటీ తహసీల్దార్ కృష్ణ ఉన్నారు. మహదేవపూర్ మండలంలోని కుంట్లం గ్రామంలో సబ్ కలెక్టర్ పర్యటించారు. ఆర్వోఎఫ్ఆర్ పట్టాల విషయంలో ఎదురవుతున్న సమస్యల గురించి రైతులను అడిగి తెలుసుకున్నారు. కుంట్లం గ్రామం గోదావరి ప్రవాహం ఎక్కువగా ఉన్నప్పుడు ముంపునకు గురవుతోందని, ప్రజలకు పునరావాసం కల్పించాలని అధికారులను ఆదేశించారు.

ఉద్యమాల యోధుడు ప్రభంజన్ కన్నుమూత



- ఐఐఎస్ ఉద్యోగానికి రాజీనామా చేసి తెలంగాణ ఉద్యమంలోకి...
- బీసీ కులాల హక్కుల కోసం నిరంతర పోరాటం
- విద్యావేత్తగా, రచయితగా, జర్నలిస్టుగా తనదైన ముద్ర
- తెలంగాణ వర్సిటీలో జర్నలిజం ప్రొఫెసర్‌గా కొంతకాలం విధులు
- స్వస్థలం పాలకుర్తి మండలం గూడూరు గ్రామం
- సంతాపం తెలిపిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్
- పార్థివదేహం జనగామ వైద్య కళాశాలకు అప్పగింత

ఆరో పేజీ...

మేడిగడ్డ బ్యారేజీకి కొనసాగుతున్న వరద

మహదేవపూర్ రూరల్, జూలై16(ఆంధ్రజ్యోతి): జయ శంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని మేడిగడ్డ బ్యారేజీకి వరదప్రవాహం కొనసాగుతోంది. బ్యా రేజీలోకి 98,440 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా నీటిమ ట్టం 2.10మీటర్ల ఎత్తులో ఉంది. బుధవారం గేట్లన్నీ ఓపెన్ చేసి దిగువకు అంతే నీటిని పంపిస్తున్నారు.

స్వాతంత్ర్య సమరయోధుడి మృతి


గండ్ర లింగారావు(ఫైల్)

మొగుళ్లపల్లి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రంగాపురం గ్రామానికి చెందిన స్వాతంత్ర్య సమరయోధుడు గండ్ర లింగారావు(92) బుధవారం ఉదయం అనారోగ్యంతో మృతిచెందారు. రజాకార్లతో జరిగినపోరాటంలో లింగారావు పాత్ర ఎంతో ఉందని గ్రామస్థులు తెలిపారు. దేశం కోసం ఆయన చేసిన కృషి, గొప్పతనాన్ని స్మరించుకున్నారు. లింగారావు భార్య సుగుణమ్మ మూడునెలల క్రితం మరణించగా అప్పటి నుంచి ఆయన మనోవేదనకు గురైనట్లు గ్రామస్థులు తెలిపారు. ఆయన మృతదేహాన్ని వివిధ పార్టీల నాయకులు సందర్శించి నివాళులు అర్పించారు. అంత్యక్రియల్లో గ్రామస్థులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఆయనకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

బొగ్గు ఉత్పత్తిని పెంచాలి

సింగరేణి జీఎం రాజేశ్వర్‌రెడ్డి

కృష్ణకాలనీ, జూలై 16 (ఆంధ్రజ్యోతి): నూతనంగా అండర్ మేనేజర్లుగా ఎంపికైన వారు సంస్థలోని ఉత్పత్తి, ఉత్పాదకను పెంచేలా కృషి చేయాలని ఏరియా జనరల్ మేనేజర్ ఏనుగు రాజేశ్వర్‌రెడ్డి కోరారు. జీఎం కార్యాలయంలో ఇటీవల అండర్ మేనేజర్ల పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన ఏరియాలోని ఉద్యోగులను బుధవారం అభినందించారు. ఎంతో కష్టపడి అండర్ మేనేజర్లుగా ఎంపికకావడం శుభపరిణామమన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వో టూ జీఎం కవీంద్ర, పర్సనల్ మేనేజర్ కావూరి మారుతితో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.


అండర్‌మేనేజర్లను అభినందిస్తున్న జీఎం రాజేశ్వర్‌రెడ్డి

గోరింటాకు సందడి

కృష్ణకాలనీ, జూలై 16 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని కృష్ణకాలనీలో ఉన్న మినీ ఫంక్షన్‌హాలులో సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో మహిళలకు ఆషాడం గోరింటాకు వేడుక నిర్వహించారు. ముఖ్య అతిథిగా సేవా సమితి అధ్యక్షురాలు ఏనుగు సునీతారెడ్డి హాజరై పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సేవా సెక్రటరీ జి.లక్ష్మి, సభ్యులు పుష్పలత, జ్యోతి, రాజేశ్వరి, మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.


గోరింటాకు పెట్టుకున్న మహిళలు

ఎండాకాలాన్ని తలపిస్తున్న వానాకాలం

● పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో జనం ఉక్కిరి బిక్కిరి
● వర్షం కోసం ఎదురు చూస్తున్న రైతన్నలు, ప్రజలు

మహబూబాబాద్ టౌన్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో ఎండాకాలం తలపిస్తోంది. జోరుగా వర్షాలు కురిసే జూలై మాసంలో వేసవి ఎండల తీవ్రతతో ఉష్ణోగ్రతలు పెరుగుతుండడంతో జనం ఉక్కిరి బిక్కిరవుతున్నారు. జూన్ మాసంలో రోహిణి కార్తె పూర్తయి మృగ శిర కార్తె ప్రవేశంతోనే వర్షాలు ఆరంభమై వ్యవసాయ పనులు షురూ అవు తాయి. ఈ సంవత్సరం ముందస్తుగా నైరుతి రుతుపవనాలు వచ్చి వర్షాలు పడుతాయని వాతావరణ శాఖ అధికారులు చెప్పినప్పటికి నేటికి వర్షాలు జాడ లేకుండా పోయాయి. జూన్ మాసంలో అడపాదడప జల్లులు కురవడంతో రైతన్నలు పూనసి పంటలు వేశారు. అక్కడక్కడ రైతులు ముందస్తుగా పత్తి విత్తనాలు కూడ నాటారు. వరి నార్లు కూడ పోసుకుని సిద్ధంగా ఉన్నారు. వర్షాలు వస్తే పొలాల్లో నాట్లు వేసేందుకు అన్నదాతలు సిద్ధమవుతున్నారు. భూగర్భజలాలు అడుగంటి వ్యవసాయ బావుల్లో నీరు అంతగా లేక పోవడంతో పత్తి చేనులు ఎండి పోతాయ మోనన్న ఆందోళనతో ఎప్పుడు వర్షం వస్తుందా అని ఆకాశం వైపు ఎదురు చూస్తున్నారు. కొన్ని గ్రామాల్లో వరుణ దేవుడు కరుణించి వర్షం కురిపిం చాలని పూజలు చేస్తున్నారు.



మహబూబాబాద్ శివారు పత్తిపాక రోడ్డులో మిట్ట మధ్యాహ్నం వేళలో నిర్మానుష్యంగా కన్పిస్తున్న రోడ్డు

జూలై సగం దాటిన పెరుగుతున్న ఉష్ణోగ్రతలు ....

వర్షాకాలం ఆరంభమై నెల దాటిన.. జూలై మాసం సగం పూర్తయిన వర్షాలు పడక పోగా రోజు రోజుకు ఉష్ణోగ్రతలు పెరుగుతూ ఎండ కాలా న్ని తలపిస్తోంది. రోజు రోజుకు ఉష్ణోగ్రతలు పెరిగి ఉక్క పోతతో జనం అల్లాడి పోతున్నారు. ఇంకా ఎండాకాలం తరహాలోనే ఇళ్లలో ఏసీలు, కూల ర్లు నడుస్తునే ఉన్నాయి. ఉపశమనం కోసం జ్యూస్ షాపులు, కొబ్బరి బొండాల దుకాణాలను ఆశ్రయిస్తున్నారు. గత నాలుగు రోజులుగా ఎండ లు విపరీతంగా ఉండడంతో ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్నాయి. ఈనెల 13న అత్యధికంగా 36.9 డిగ్రీలు, అత్యల్పంగా 24.2 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి. 14న అత్యధికంగా 37.3, అత్యల్పంగా 25.1, 15న అత్యధికంగా 37.8, అత్యల్పంగా 24.7 డిగ్రీలు, తాజాగా 16న అత్యధికంగా 37.5, అత్యల్పంగా 25.3 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

షార్ట్‌సర్క్యూట్‌తో రైస్‌మిల్లులో అగ్నిప్రమాదం



షెడ్డులో చెలరేగుతున్న మంటలు

గోవిందరావుపేట, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా గోవిందరావుపేట మండలకేంద్రంలోని శ్రీవాసవాంబ రైస్‌మిల్లులో బుధ వారం ఉదయం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం సంభవించింది. రైస్‌మిల్లు యజమాని చంద్రశేఖరరెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఉదయం 11గంటల సమయంలో మిల్లు ముందుభాగంలో ఉన్న షెడ్డులో 100గన్ని బ్యాగులను భద్రపరిచామని అన్నారు. అప్రాంతానికి కోతులమూక పెద్ద సంఖ్యలో చేరుకుని కరెంటు వైర్లను ఊపడంతో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ జరిగి మంటలు చెలరేగి షెడ్డు పూర్తిగా దగ్ధమైందని అన్నారు. కిటికీ మీదుగా మిల్లు లోపలికి మంటలు వ్యాపిస్తుండగా చుట్టుపక్కల వారు గమనించి పోలీసులకు సమాచారం అందించారని తెలిపారు. దీంతో స్పందించిన ప్రసా సీఐ రవీందర్, ఎస్సై కమలాకర్‌లు ఫైరింజన్‌ను తెప్పించి మంటలు ఆర్పించారని, ఈఘటనలో రూ.లక్ష ఆస్తి నష్టం వాటిల్లినట్లు ఆయన పేర్కొన్నారు.

మానుకోటలో మతిస్థిమితంలేని వ్యక్తి వీరంగం

● ఇద్దరిపై దాడి.. కారు అద్దాలు ధ్వంసం



జానీని తాళ్లతో కట్టేసి జిల్లా ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

మహబూబాబాద్ రైం, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : మతిస్థిమితం కోల్పోయిన ఓ వ్యక్తి మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని మార్కెట్ బజారులో బుధవారం వీరంగం సృష్టించాడు. పార్కింగ్ చేసిన కారు అద్దాలు పగులగొట్టడంతో పాటు కత్తెరతో ఇద్దరు బాటసారులపై దాడికి పాల్పడిన సంఘటన బుధవారం చోటు చేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మరిపెడ మండలం బురా న్‌పురం గ్రామానికి చెందిన ఎస్‌కే జానీ అనారోగ్యంతో ఈ నెల 14న జిల్లా ప్రధాన ఆస్పత్రిలో చేరాడు. బుధవారం సాయంత్రం వైద్య పరీక్షలు నిర్వహిస్తు న్న క్రమంలో ఒక్కసారిగా ఆస్పత్రి నుంచి బయటకు వెళ్లి మార్కెట్ బజారులో అరవింద్ హాస్పటల్ ఎదుట పార్కింగ్ చేసిన కారు అద్దాలు ధ్వంసం చేశాడు. అటువైపుగా వెళ్తున్న బాటసారులపై కత్తెరతో దాడి చేశా, గాయపరు స్తున్న క్రమంలో స్థానికులు జానీని కాళ్లు, చేతులు కట్టి బంధించి టౌన్ పోలీసు లకు సమాచారం అందించారు. ఎస్సై శివ నీల్యంతో మహిళా స్టలంకు చేరు కొని జానీని ఆటోలో జిల్లా ఆస్పత్రికి తరలించి, చికిత్స అందజేస్తున్నట్లు తెలి పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై శివ తెలిపారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యులను నియమించాలి

సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ జిల్లా అధ్యక్షుడు మల్లేష్

చిట్యాల, జూలై 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక సామాజిక ఆస్పత్రిలో అవసర మైన వైద్యులను నియమించాలని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ పార్టీ భూపా లపల్లి జిల్లా అధ్యక్షుడు మారపెల్లి మల్లేష్ డిమాండ్ చేశారు. బుధవారం మండ ల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మల్లేష్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రిలో 18 మంది వైద్యులకు గాను 6గురు వైద్యులు మాత్రమే విధులు నిర్వ ర్తిస్తున్నారని తెలిపారు. మండలంతో పాటు చుట్టుపక్కల నాలుగు మండలా లకు చెందిన పేద ప్రజలు వందల సంఖ్యలో చిట్యాల ఆస్పత్రికి వస్తున్నారు. కన్సల్టెంగ్ గైనకాలజిస్ట్, పిల్లల వైద్యులు, డెంటిస్ట్ వైద్యులు లేకపోవడంతో రోగులు ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లి ఆర్థికంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి ఆస్పత్రిలో వైద్యు లను నియమించాలని కోరారు.

ఆయిల్‌పామ్ సాగుకు ముందుకు రావాలి

ములుగు కలెక్టర్ దివాకర

ములుగు కలెక్టరేట్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని రైతులు ఆయిల్ పామ్ పంట సాగు చేసేందుకు ముందుకు రావాలని, ఇందుకోసం సం బంధిత శాఖల అధికారులు ఆయిల్‌పామ్ సాగు, లాభాలపై అవగాహన కల్పించాలని కలెక్టర్ టీఎస్.దివాకర అన్నారు. కలెక్టరేట్ సమావేశ మం దిరంలో ఆయిల్ పామ్ సాగుపై వ్యవసాయ, ఉద్యానశాఖల అధికారులతో బుధవారం సమా వేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మా ట్లాడుతూ ఆయిల్‌పామ్ సాగు రైతులకు లాభదా యకమని, వ్యవసాయ, ఉద్యానశాఖల సంయుక్త కృషితో ఈఏడాది సాగు లక్ష్యాలను పూర్తి చేయా లన్నారు. మండల వ్యవసాయ అధికారి వారీగా సాగు లక్ష్యాలను నిర్దేశించి పూర్తి చేయాలని ఆదేశించారు. పంట మార్పిడి ద్వారా ఆయిల్‌పామ్ పంట సాగుపై రైతులకు అవగాహన కల్పించాల ని, క్షేత్ర స్థాయిలో సంబంధితశాఖ అవగాహన సదస్సులు, ప్రచారం నిర్వహించాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

ఆయిల్‌పామ్ వంట సాగుద్వారా అనేక లాభాలు చేకూరుతాయ ని, ప్రభుత్వం కల్పించిన సబ్సిడీ, రాయితీల వివరాలను తెలియజేయా లన్నారు. జిల్లాలో మండలాలవారీగా ఏఈవో క్లస్ట ర్‌వారీగా ఐడెంటిఫై చేసిన పైబడి రైతుల వివరాలు, బోరు సౌకర్యం కలిగిన రైతులను గుర్తించి ప్రతి ఒక్కరూ ఆయిల్‌పామ్ పంట సాగుచేసేలా ప్రోత్స హించాలన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో 5వేల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు చేయాలని, నిర్దేశించిన టార్గెట్లను పూర్తి చేయాలని ఆయన సూచించారు. ఈసమావేశంలో జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ అధికారి సంజీవరావు, జిల్లా వ్యవసాయ అధికారి సురేష్‌కుమార్, వ్యవసాయ, ఉద్యాన అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికా రులు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందాలి

డిప్యూటీ స్పీకర్ రాంచంద్రునాయక్

మరిపెడ, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : అర్హులందరికీ ప్ర భుత్వ సంక్షేమ పథకాలు అందాలని డిప్యూటీ స్పీకర్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోత్ రాంచంద్రునాయక్ అన్నారు. బుధవారం రాత్రి ఆయన మరిపెడ విశ్రాంతి భవన్‌లో అధికారులతో భూ భారతి, ఇందిరమ్మ ఇళ్లపై సమీక్షిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అంతకు ముందు మరిపెడలోని జూనియర్ సివిల్ కోర్టుకు స్థానిక అధికారులతో కలిసి స్థల పరిశీలన చేశారు. డిప్యూటీ స్పీకర్ వెంట జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు వంటికొమ్ము యుగేందర్‌రెడ్డి, మరిపెడ తహసీల్దార్ కృష్ణవేణి, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తాజుద్దీన్, రవినాయక్ తదిత రులు ఉన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

పెద్దవంగర, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ అనుమతి లేకుండా అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ఏడుగురిపై కేసు నమోదు చేసి ట్రాక్టర్లు సీజ్ చేసినట్లు బుధవారం ఎస్సై క్రాంతికిరణ్ తెలిపారు. ఎస్సై వివరాల ప్రకారం.. సూర్యపేట జిల్లా తుంగతుర్తి మండలం గొట్టి పర్తి గ్రామానికి చెందిన ట్రాక్టర్ ఓనర్ దొంగరి కమ్మ, డ్రైవర్ దొంగరి సతీష్, నాలి యాకన్న, అంగోతు చందు లాల్, ట్రాక్టర్ ఓనర్ అంగోతు అంజి, మాలోతు వెంకన్న, ట్రాక్టర్ ఓనర్ బానోతు రమేశ్, బోడ నరేశ్‌లు పెద్దవం గర మండలంలోని పోచారం శివారు ఆకేరు వాగు నుంచి ఎటువంటి ప్రభుత్వ అనుమతి లేకుండా సమీప గ్రామా లకు అక్రమంగా ఇసుక తరలిస్తున్నారు. ఈ క్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ (ఆర్ఐ) భూక్య లష్కర్, రెవెన్యూ సిబ్బంది అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లు పట్టి వేసి, పంచుల సమక్షంలో స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఆర్ఐ భూక్య లష్కర్ ఫిర్యా దు మేరకు ఏడుగురిపై కేసు నమోదు చేసి ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు తెలిపారు.

అధికారాన్ని అడ్డు పెట్టుకొని ఇసుక దందా

బీజేపీ జిల్లా అధ్యక్షుడు నిశీధర్‌రెడ్డి

టేకుమట్ల, జూలై 16 (ఆంధ్రజ్యోతి): గతంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ నాయకులు, ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ నాయకులు అధికారాన్ని అడ్డుపెట్టుకొని ఇసుక దందా చేస్తున్నారని బీజేపీ భూపాలపల్లి జిల్లా అధ్య క్షుడు ఏడునూతల నిశీధర్‌రెడ్డి ఆరోపించారు. మండల కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో ఎమ్మె ల్యేగా గండ్ర వెంకటరమణారెడ్డి, ఇప్పుడు గండ్ర సత్యనారాయణరావు ఇసుక దందాను పెంచి పోషిస్తున్నారని దుయ్యబట్టారు. ఇసుక దందా ఆపాలని... (ఇసుక క్వారీ) అక్రమంగా ఇసుకను తరలిస్తూ అక్రమార్జనకు పాల్పడుతున్నారని ఆరోపించారు. సహజ వనరులను కాపాడాల్సిన బాధ్యతను మరిచి కొత్త కొత్త పేర్లతో ఇసుకను అమ్ముకుంటున్నారన్నారు. ఇప్పటికైనా సంబంధిత జిల్లా అధికారులు స్పందిం చి టేకుమట్లలో జరిగే ఇసుక దందాను అరికట్టాలని డిమాండ్ చేశారు. ఒకరి పై ఒకరు ఆరోపణలు చేయడం మానేసి ఇసుక దందాకు ముగింపు పలికే ప్రయత్నాలు చేయడం మంచిదని హితవు పలికారు. ఈ సమావేశంలో బీజేపీ మండల అధ్యక్షుడు గుర్రపు నాగరాజ్, నాయకులు దేశెట్టి గోపాల్, బం డారి సమ్మయ్య, సురేందర్‌రెడ్డి, అశోక్, రామ్మోహన్‌రావు, దొమ్మాటి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నిశీధర్‌రెడ్డి

నల్ల బెల్లం, పటిక పట్టివేత

ఒకరిపై కేసు.. బైక్ సీజ్

మరిపెడ, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : బైక్‌పై నల్ల బెల్లం, పటిక తరలిస్తున్న ఓ వ్యక్తిపై కేసు నమోదు చేసి, ఆ బైక్‌ను సీజ్ చేసినట్లు మరిపెడ ఎస్సై బోలగాని సతీశ్‌గౌడ్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మరిపెడ మునిసిపల్ పరిధి బిక్యాతండా తండాకు చెందిన కేలోత్ లాల్‌సింగ్ మంగళవారం రాత్రి వీరారం శివార్లో దంపు చేసిన నల్ల బెల్లం, పటి కను బైక్‌పై తరలిస్తుండగా పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులకు పట్టుపడ్డాడు. బైక్‌ను సీజ్ చేసి, లాల్‌సింగ్ పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మా భూములకు పట్టాలివ్వండి

● స్థానిక ఎన్నికల వరకు పట్టాలివ్వకుంటే ఎలక్షన్లు బహిష్కరిస్తాం
● కలెక్టరేట్ ఎదుట నారాయణపురం రైతుల ఆందోళన

మహబూబాబాద్ టౌన్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్ కలె క్టర్ కార్యాలయం ఎదుట బుధవారం కేసముద్రం మండలం నారాయణపురం రైతులు తమ భూములకు పట్టాలివ్వాలని ఆందోళన చేపట్టారు. 'తమ పట్టా భూములకు పట్టాలివ్వండి' పొంగలేటి సారు.. అంటూ' ఫ్లెక్సీలను ప్రదర్శిం చారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ నారాయణపురం రైతులకు ఏనిమిదేళ్లుగా పట్టేదారు పాస్‌పుస్తకాలు లేక రైతుబంధు, రైతు బీమా, రుణమాఫీ, పంట రుణాలకు దూరమయ్యామని ఆవేదన వ్యక్తం చేశా రు. తక్షణమే తమ భూములకు పట్టాలిచ్చి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.



కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న రైతులు

స్థానిక సంస్థల ఎన్నికల వరకు తమ భూములకు పట్టాలివ్వకుంటే గ్రామంలో ఆ ఎన్నికలను బహిష్కరిస్తామని స్పష్టం చేశారు. మాజీ ఎంపీటీసీ దారవత్ రవి, భీమా, వీరన్న, విరసింగ్, లచ్చు, లక్ష్మీపతి, వెంకన్న, రవి, భాస్కర్, దేవా, బాలచందర్, శ్రీను పాల్గొన్నారు.

పెండింగ్ స్కాలర్‌షిప్‌లు మంజూరుచేయాలి

వెంకటాపురం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): పెండిం గ్‌లో ఉన్న స్కాలర్‌షిప్ లను మంజూరు చేయాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు బుధవారం ములుగు జూనియర్ కళాశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రవి మాట్లాడుతూ నూతనంగా మంజూరైన ప్రభుత్వ జూనియర్ కళాశాలకు కొత్త భవనం మంజూరు చేయాలని, పీజు రీయింబర్స్‌మెంట్ నిధులను తక్షణమే విడుదల చేయాలని, విద్యార్థులకు పూర్తిస్థాయిలో పాఠ్యపుస్తకాలు అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ వేణుగోపాల్‌కు అందజేశారు. ఈకార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు సోడి అశోక్, వంశీ, విద్యార్థులు పాల్గొన్నారు.



తహసీల్దార్ కార్యాలయం ఎదుట మాట్లాడుతున్న రవి

మందులతో టీబీ వ్యాధిని అరికట్టొచ్చు

టీబీ నియంత్రణ జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్ విజయ్‌కుమార్

మరిపెడ, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : మందులతో టీబీ వ్యాధిని అరికట్టొచ్చు నని టీబీ నియంత్రణ జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ విజయ్‌కుమార్ అన్నా రు. బుధవారం మరిపెడ పీహెచ్‌సీలో వైద్యులకు, వైద్య సిబ్బందికి టీబీ నియంత్రణపై అవగాహన సదస్సు నిర్వహించి మాట్లాడారు. ఈ నెల 17 నుంచి 31వ తేదీ వరకు ఈపూరా టీబీ ముక్త్‌భారత్ ప్రోగ్రామ్ నిర్వహించాలని ఆయన పల్లె డాక్టర్లకు, వైద్య సిబ్బందికి సూచించారు. వారాల తరబడి దగ్గు ఉండడం, జ్వరం, బరువు తగ్గడం, ఆకలి లేకపోవడం లక్షణాలు ఉన్నవారు వైద్య పరీ క్షలు చేయించుకోవాలన్నారు. టీబీ వ్యాధిగ్రస్తులకు దాతలు న్యూట్రిషన్ కిట్లు ఇవ్వడానికి ముందుకు వచ్చి సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో మం డల మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రవి, హెల్త్ సూపర్ వైజర్లు మంగమ్మ, సుదర్శన్, ఆరోగ్యులు, క్షయ వ్యాధి సిబ్బంది సిలీమ, అశోక్, జయరాం, సాయి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న టీబీ నియంత్రణ ప్రోగ్రామ్ ఆఫీసర్ విజయ్‌కుమార్

చికిత్స పొందుతూ మహిళ మృతి

పెద్దవంగర, జూలై 16 (ఆంధ్రజ్యోతి): చికిత్స పొందుతూ మహిళ మృతి చెంది న సంఘటన మండలంలోని గంట్లకుంట గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. బుధవారం ఎస్సై క్రాంతి కిరణ్ వివరాల ప్రకారం.. గంట్లకుంట గ్రామానికి చెందిన గుంటల అమృత (42) గత కొంతకాలం గా అనారోగ్యంతో ఇబ్బందులు పడుతు దూ తీవ్ర మనస్తాపంతో ఈ నెల 14వ తేదీన ఇంట్లో ఎవరులేని సమయంలో క్రిమిసంహారక మందు తాగింది. గమనిం చిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. చికిత్స నిమిత్తం వరంగల్‌లోని ఎంజీ ఎం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొం దుతూ మృతి చెందింది. మృతురాలి తండ్రి ముక్కామల కొమురయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. శవ పం చనామా నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తర లించినట్లు ఎస్సై తెలిపారు. మృతురాలు గుంటల అమృతకు కొడుకు, కుమార్తె ఉన్నారు. భర్త కొంత కాలం కిందట మృతి చెందాడు.

గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో
ఏసీబీ అధికారుల సోదాలు

● రికార్డులు పరిశీలన, పలురకాల సరుకుల శాంపిల్స్ సేకరణ

మహబూబాబాద్ రైం, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ఏసీబీ డీఎస్పీ సాంబయ్య పర్యవేక్షణలో ఫుడ్ ఇన్‌స్పెక్టర్, లీగల్ మెట్రాలజీ, రాష్ట్ర ఆడిట్ అధికారుల బృందం బుధవారం తనిఖీలు చేపట్టింది. పాఠశాల ప్రిన్సిపాల్ అనిత అందజేసిన రికార్డులను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఏసీ బీ డీఎస్పీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదే శాల మేరకు మహబూబాబాద్ జిల్లా కేంద్రం లోని ప్రభుత్వ గిరిజన బాలికల ఆశ్రమ పాఠశా లను వరంగల్ ఏసీబీ వారి ఆధ్వర్యంలో జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్, లీగల్‌మెట్రాలజీ, రాష్ట్ర ఆడిట్ అధికారుల బృందం సమన్వయంతో పాఠశాలను సందర్శించి, సోదాలు నిర్వహించినట్లు తెలిపారు. అన్ని రకాల రికార్డులను పరిశీలించినట్లు తెలిపారు. వాటిల వసతులు, పరిసరాల పరిశుభ్రత, బిల్డింగ్ వసతి, ప్రభుత్వం నుంచి సరఫరా అయ్యే అన్ని రకాల సరుకుల నాణ్యతను పరిశీలించినట్లు తెలిపారు. కారం, పసుపు, చింతపండుతో పాటు పలు రకాల సరుకుల శాంపి ల్స్‌ను సేకరించామని, క్షేత్రస్థాయి నివేదిక, సరుకుల శాంపిల్స్‌ను ప్రభుత్వ ఉన్నతాధికారులకు అందజేస్తా మన్నారు. కార్యక్రమంలో ఏసీబీ ఇన్‌స్పెక్టర్లు ఎస్.రాజు, ఎల్.రాజు, అధికారులు ఉన్నారు.



గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో రికార్డులు పరిశీలిస్తున్న అధికారుల బృందం

వరంగల్ మార్కెట్ ధరలు
(రూ. క్వింటా)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
మక్కలు	2456	1521
పల్లికాయ (సూక)	6110	3450
పల్లికాయ (పచ్చిది)	4550	1575
కందులు	5889	3022
పెసళ్లు	8001	3022
పత్తి	7750	5300
పసుపు (కాడి)	11555	9534
పసుపు (గోల)	10259	9700
తేజ మిర్చి	12000	8500
తేజ ఏసీ	13300	11500
వండర్‌హాట్	11000	6000
వండర్‌హాట్ ఏసీ	14500	11500
యూఎస్341ఏసీ	12500	7000
దీపిక	9000	8000
సింగిల్‌పట్టి ఏసీ	-	-
తాలు మిర్చి	6500	3000

- వరంగల్ వ్యవసాయం

మళ్లీ 'ఇచ్చంపల్లి'..

- తెరపైకి బహుళార్థ సాధక ప్రాజెక్టు అంశం
- 17 ఏళ్ల తర్వాత మరోసారి ప్రతిపాదన
- కేంద్రానికి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి లేఖ


ఇచ్చంపల్లి వద్ద గోదావరి నదిలో గత ప్రాజెక్టు ఆనవాళ్లు

భూపాలపల్లి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): శతాబ్దాల చారిత్రక నేపథ్యం కలిగి ఉన్న ఇచ్చంపల్లి బహుళార్థక ప్రాజెక్టు నిర్మాణ అంశం మరోసారి తెరపైకి వచ్చింది. భూపాలపల్లి జిల్లా పలిమెల మండలం ఇచ్చంపల్లి వద్ద గోదావరి, ఇంద్రావతి నదులు కలిసే చోట రిజర్వాయర్ నిర్మించడం ద్వారా గోదావరి-కావేరి నదుల అనుసంధానం చేయాలని ప్రతిష్ఠాత్మకంగా చేపట్టనున్న కార్యక్రమంలో ఈ ప్రతిపాదనలు చేర్చాలంటూ రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కేంద్ర జలవనరుల మంత్రిత్వ శాఖకు లేఖ రాయడం చర్చనీయాంశమైంది.

వాస్తవానికి 2008లో అప్పటి ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖర రెడ్డి హయాంలోనే ఇచ్చంపల్లి, ప్రాణహిత, కంతనపల్లి ప్రాజెక్టులను నిర్మించాలని నిర్ణయించారు. ఈ క్రమంలో మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలను ఒప్పించే ప్రయత్నాలు కూడా అప్పట్లో జరిగాయి. మహారాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించినా ఛత్తీస్‌గఢ్ వైపు అత్యధికంగా 9,500 ఎకరాలకు పైగా ముంపు ప్రాంతం ఉండటంతో ఆ రాష్ట్ర ప్రభుత్వం అనుమతులకు మోకాలడ్డింది. దీంతో ఆ ప్రతిపాదనలు మరుగున పడ్డాయి.

వై.ఎస్.రాజశేఖరరెడ్డి మరణించడం, రాష్ట్ర విభజన జరగడం లాంటి పరిణామాల క్రమంలో అధికారం చేపట్టిన టీఆర్ఎస్ మహాదేవపూర్ మండలం మేడిగడ్డ వద్ద కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టింది. ఈ పరిస్థితుల్లో ఇచ్చంపల్లి అంశం దాదాపు తెరమరుగైంది. అంతకుముందు ఈ ప్రాజెక్టు నిర్మాణం కోసం నాటి కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి చెన్నమనేని విద్యాసాగర్‌రావు నేతృత్వంలో ప్రాజెక్టు సాధన సమితి ప్రతిపాదిత స్థలం వరకు పాదయాత్ర చేసి ఇచ్చంపల్లి వద్ద గోదావరి మాత విగ్రహాన్ని కూడా ఏర్పాటు చేశారు. అంతే కాదు.. ఇచ్చంపల్లి ప్రాజెక్టును నిర్మించడం ద్వారా నాసిక్ నుంచి ధవళేశ్వరం దాకా జల రవాణాకు వీలుగా వాటర్ వే కూడా ఏర్పాటు చేసే అవకాశం ఉన్నందున కేంద్రం పరిశీలించాలని అప్పట్లో డిమాండ్ చేశారు. బీజేపీతోపాటు సీపీఎం నేతలు కూడా ప్రాజెక్టు సాధన కోసం ఇచ్చంపల్లి దాకా పాదయాత్ర చేశారు. గోదావరి వరదతోపాటు మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ మీదుగా ప్రవహించే ఇంద్రావతి ద్వారా జల లభ్యత అధికంగా ఉన్న దృష్ట్యా ఇక్కడ ప్రాజెక్టు నిర్మించడం ద్వారా అటు విద్యుత్తు ఉత్పాదనతో పాటు నీటిని ఎత్తిపోసే దాదాపు 7లక్షల ఎకరాల భూములకు సాగునీటిని కూడా అందించే అవకాశం ఉంటుందని అంచనా వేశారు.

ఇచ్చంపల్లికి 159 ఏళ్ల చరిత్ర

ఇచ్చంపల్లి ప్రాజెక్టు చరిత్ర చాలా పురాతనమైనది. నిజాం కాలంలోనే అంటే.. 1866లో ఫ్రెంచ్ ఇంజనీర్ల సలహాతో ప్రాజెక్టు నిర్మాణానికి బీజం పడింది. అప్పట్లో ఈ ప్రాజెక్టు నిర్మాణానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు జరిగాయి. నిర్మాణ పనులు ప్రారంభించారు. అయితే 1869లో ప్రబలిన ప్లేగు వ్యాధి కారణంగా నిర్మాణం అర్థంతరంగా ఆగిపోయింది.

ఈ ప్రాజెక్టు నిర్మాణంలో క్రియాశీలకంగా పనిచేసిన ఫ్రెంచి ఇంజనీర్ కుటుంబ సభ్యులు ప్లేగు వ్యాధికి బలైపోవడంతో కార్మికులు ఇంజనీర్లు పనులను వదిలేసి ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని అక్కడ నుంచి వెళ్లిపోయారని చెబుతుంటారు. ఆ ఫ్రెంచ్ ఇంజనీర్ కుటుంబ సభ్యుల సమాధులు, నిర్మాణ సామగ్రి, సున్నపు బట్టీల ఆనవాళ్లు ఇప్పటికీ ఇచ్చంపల్లి ప్రాజెక్టు పరిసరాల్లో చెక్కుచెదరకుండా ఉన్నాయి. అప్పట్లో గోదావరికి అడ్డుగా ఇంద్రావతి కలిసే చోట బట్టి సున్నం, రాళ్లతో కట్టిన నిర్మాణాలు 159 ఏళ్లయినా చెక్కుచెదరకుండా కనిపించడం విశేషం.

మేడిగడ్డ ఉనికి ప్రశ్నార్థకం..

బనకచర్ల వివాదం నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చంపల్లి వద్ద గోదావరి-కావేరి నదుల అనుసంధానానికి గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం ద్వారా కాళేశ్వరం భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. కేంద్ర ప్రభుత్వం ఈ ప్రతిపాదనలకు ఆమోదముద్ర వేస్తే ఇచ్చంపల్లి వద్ద 100మీటర్ల ఎత్తుతో జలాశయ నిర్మాణం జరుగుతుంది. దీంతో లక్ష కోట్లు ఖర్చు చేసి నిర్మించిన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల భవిష్యత్తు ఏమిటనే చర్చ మొదలైంది.

2023లో మేడిగడ్డ, అన్నారం బ్యారేజీలు దెబ్బతినడంతో నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ నీటిని నిల్వ చేయకుండా ఆదేశాలు జారీ చేసింది. రాష్ట్ర ప్రభుత్వ తాజా ప్రతిపాదనల ప్రకారం మేడిగడ్డకు ప్రత్యామ్నాయంగా ఇచ్చంపల్లి ప్రాజెక్టు చేపడితే బ్యాక్ వాటర్ ద్వారా నీటిని వాడుకునే వెసులుబాటు ఉంటుందని, అలాంటప్పుడు ఇక మేడిగడ్డతో పనేముంటుందని నిపుణులు అంటున్నారు.

బనకచర్ల వివాదం నేపథ్యంలో..

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గోదావరి జలాలను బనకచర్లకు అనుసంధానం చేయడం ద్వారా రాయలసీమలోని ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు జిల్లాలకు సాగునీటిని అందించే ఉద్దేశంతో బనకచర్లకు అనుమతులను కోరుతూ కేంద్రానికి ప్రతిపాదనలు సిద్ధం చేసిన నేపథ్యంలో గోదావరి జలాల తరలింపుపై తెలంగాణ అభ్యంతరాలు లేవనెత్తింది. దీంతో వివాదం రాజుకుంది. ఈ నేపథ్యంలో నిన్న మొన్నటి వరకు ఇచ్చంపల్లి నుంచి దక్షిణాది రాష్ట్రాలకు గోదావరి జలాలను తరలించడంపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ వచ్చిన రాష్ట్రం తాజా పరిణామాల్లో గోదావరి-కావేరి నదుల అనుసంధాన ప్రక్రియకు సూత్రప్రాయ అంగీకారం తెలపడం చర్చనీయాంశంగా మారింది. తద్వారా ఇచ్చంపల్లి వద్ద 100 మీటర్ల ఎత్తుతో డ్యామ్‌ను నిర్మించడం ద్వారా అటు 975 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తితో పాటు దాదాపు 200 టీఎంసీల వరకు నీటిని ఎత్తిపోసే అవకాశం ఉందంటూ రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కేంద్రానికి ప్రతిపాదించారు. ఈ ప్రాజెక్టును ప్రధాన మంత్రి కృషిసంచాయి యోజన పథకంలో చేర్చి నిధులు కేటాయించాలని కేంద్రానికి ప్రతిపాదించడం ఆసక్తిని రేకెత్తిస్తోంది.


ఇచ్చంపల్లి వద్ద గోదావరి నదిలో ఫ్రెంచ్ అధికారులు నిర్మించిన కట్టడం


డీఐజీకి గౌరవ వందనం చేస్తున్న బెటాలియన్ సిబ్బంది


బెటాలియన్ సిబ్బందికి సూచనలు ఇస్తున్న డీఐజీ సి.సన్నీ

విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలి..

టీజీఎస్పీ బెటాలియన్ డీఐజీ సి.సన్నీ

మామునూరు, జూలై 16 (ఆంధ్రజ్యోతి): విధినిర్వహణలో పోలీసులు అప్రమత్తంగా ఉండాలని, తగిన జాగ్రత్తలు పాటించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని టీజీఎస్పీ బెటాలియన్ డీఐజీ సి.సన్నీ సూచించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా బుధవారం ఆయన మామునూరు బెటాలియన్‌ను సందర్శించారు. బెటాలియన్ కమాండెంట్ బి.రామ్ ప్రకాశ్ ఆధ్వర్యంలో డీఐజీకి ఘనస్వాగతం పలికారు. బెటాలియన్ సిబ్బంది గౌరవ వందనం సమర్పించారు. అనంతరం బెటాలియన్‌లోని మోటర్ ట్రాన్స్‌పోర్టు, హెడ్‌క్వాటర్ యూనిట్ హాస్పిటల్, క్యాంప్ ఆఫీసులను తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిత్యం క్రమశిక్షణతో మెలగాలని, బాధ్యతగల ఉద్యోగులుగా ప్రజలకు సేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్‌లు కృష్ణ ప్రసాద్, శ్రీనివాస రావు, వీరన్న, ఆర్ఐలు ఆర్ఎస్ఐలు, బెటాలియన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

డీఎంహెచ్‌వో డాక్టర్ అప్పయ్య


మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ అప్పయ్య

వరంగల్ మెడికల్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని హనుమకొండ డీఎంహెచ్‌వో డాక్టర్ అప్పయ్య అన్నారు. బుధవారం రాయపర్తి పీహెచ్‌సీ పరిధిలోని నార్లాపూర్, చర్లపల్లి ఆరోగ్య ఉప కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా ప్రజలకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకొని రికార్డులను పరిశీలించారు. సీజనల్ వ్యాధుల పట్ల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, ఆశ కార్యకర్తలు, హెల్త్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలు ప్రతీ రోజు గృహ సందర్శన చేయాలని ఆదేశించారు. కంఠాత్మకూరు గ్రామంలో ఎక్కువగా ఫీవర్ కేసులు వస్తున్నాయని వెంటనే స్పెషల్ ఫీవర్ సర్వే చేపట్టి చికిత్స అందించాలన్నారు. పరకాల సివిల్ ఆస్పత్రిలో వచ్చే మూడు రోజులు నిర్వహించే టీబీ పరీక్షలను క్యాంపులను ప్రజలు వినియోగించుకోవాలన్నారు.అవసరం ఉన్న వారికి ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఎక్స్‌రే పరీక్షలు చేసేందుకు సిద్ధం చేశామన్నారు. ఈ కార్యక్రమంలో రాయపర్తి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కొక్కొండ దివ్య, పల్లె దవాఖానా డాక్టర్లు, సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, హెల్త్ అసిస్టెంట్లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.


కస్తూరీనగరంలో నీళ్ల బిందెతో వరి నారు తడుపుతున్న రైతు రాంబాబు

హలధారి.. అరిగోస

నారుమడులు కాపాడుకునేందుకు భగీరథ ప్రయత్నం..

బయ్యారం, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : వరుణుడు ముఖం చాటే శాడు. రైతన్న అరిగోస పడుతున్నాడు. పంటను కాపాడుకోవడానికి భగీరథ ప్రయత్నం చేస్తున్నాడు. వానాకాలం ప్రారంభమై రెండునెలలు కావస్తున్నా.. సరిపడా వానలు పడిన దాఖలాలు లేవు. ఖరీఫ్ పంట సాగుకు ఆదిలోనే వరుణుడు శాపంగా మారాడు. ఎప్పటిలాగానే ఈ ఏడాది కూడా రైతన్నలు పక్షం రోజుల క్రితం సాగు పనులు ప్రారంభించారు. అందులో భాగంగా పలువురు రైతులు వరి నారుమడి సిద్ధం చేసి విత్తనాలు చల్లారు. అనంతరం అరకొర చిరు జల్లులు మినహా పెద్దగా వర్షాలు కురవకపోవడంతో చాలా మంది రైతుల వరి నారు ఎండిపోయే దశకు చేరుకుటుంది. ఈ క్రమంలోనే బుధవారం మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం కస్తూరీనగరం గ్రామానికి చెందిన మాలోత్ రాంబాబు, దరావత్ బాబులాల్ అనే రైతులు వరి నారును బతికించుకునేందుకు ఎన్నో వ్యయప్రయాసలకోర్చుతున్నారు.ట్యాంకర్ల సహాయంతో నీటిని తీసుకొచ్చి బిందెలు, క్యాన్లతో వరి నారుమడులను తడుపుతున్నారు.

ఖరారైన జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలు

- జడ్పీటీసీలు 75, ఎంపీటీసీలు 778
- జారీ అయిన అధికారిక ఉత్తర్వులు

హనుమకొండ, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లాలో జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలను ప్రభుత్వం ఖరారు చేసింది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. మొత్తం జడ్పీటీసీ స్థానాలు 75 కాగా, ఎంపీటీసీ స్థానాలు 778. నాలుగు కొత్త మండలాలు కేజే మల్లంపల్లి, ఇనుగుర్తి, సీరోలు, గోరికొత్తపల్లి ఏర్పాటు కావడంతో జడ్పీటీసీల సంఖ్య 71 నుంచి 75కు పెరిగింది. 3 కొత్త మున్సిపాలిటీలు- కేసముద్రం, ములుగు, స్టేషన్‌ఘనపూర్ ఏర్పాటు కావడంతో కొన్ని గ్రామాలు వాటిలో విలీనం అయినందు వల్ల ఎంపీటీసీ స్థానాలు 792 నుంచి 778కు తగ్గాయి. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ వెలువడనున్న నేపథ్యంలో ప్రభుత్వం జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలను ఖరారు చేస్తూ ప్రకటన చేసింది.

జిల్లాలు	జడ్పీటీసీలు	ఎంపీటీసీలు
వరంగల్	11	130
హనుమకొండ	12	129
జయశంకర్ భూపాలపల్లి	12	109
మహబూబాబాద్	18	193
జనగామ	12	134
ములుగు	10	83
మొత్తం	75	778

ఉద్యమాల యోధుడు ప్రభంజన్ కన్నుమూత

- విద్యావేత్తగా, రచయితగా, జర్నలిస్టుగా తనదైన ముద్ర
- సంతాపం తెలిపిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్
- పార్థివదేహం జనగామ వైద్య కళాశాలకు అప్పగింత


పాలకుర్తిలో ప్రభంజన్ మృతదేహం వద్ద గద్దర్ కూతురు వెన్నెల, జర్నలిస్టు కదిరే కృష్ణ


ప్రభంజన్ అంతిమయాత్ర

పాలకుర్తి, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : బీసీ కులాల ఉద్యమ నాయకుడు, విద్యావేత్త, రచయిత, జర్నలిస్టు యాదనాల ప్రభంజన్ కుమార్ యాదవ్ (62) బుధవారం హైదరాబాద్‌లో కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ప్రభంజన్ ఆస్పత్రిలో చికిత్స పొందారు. అనంతరం హైదరాబాద్‌లోని తన నివాసంలో విశ్రాంతి తీసుకుంటుండగా బుధవారం మరణించారు. ఆయనకు భార్య రేఖ, ఇద్దరు కుమారులు వున్నారు. ఆయన భౌతికకాయాన్ని స్వస్థలం పాలకుర్తి మండలంలోని గూడూరు గ్రామానికి తీసుకురాగా, భిన్న రంగాల ప్రముఖులు నివాళులర్పించారు. గ్రామంలో అంతిమయాత్ర నిర్వహించిన అనంతరం, పార్థివదేహాన్ని జనగామ ప్రభుత్వ వైద్య కళాశాలకు అప్పగించారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి

విద్యార్థి దశ నుంచే ఉద్యమ స్వభావం కలిగిన ప్రభంజన్ కుమార్ బలహీనవర్గాల కులాలు, బహుజన హక్కుల కోసం ఉద్యమ బాటపట్టారు. సామాజిక న్యాయం కోసం జర్నలిజాన్ని ఆయుధంగా ఉపయోగించారు. పలు పత్రికలతో పాటు విద్యారంగానికీ సేవలందించారు. కాకతీయ, తెలంగాణ యూనివర్సిటీల్లో జర్నలిజం విభాగాలను స్థాపించడంలో ముఖ్య భూమిక పోషించారు. ప్రభంజన్ స్వస్థలం జనగామ జిల్లా పాలకుర్తి మండలంలోని గూడూరు గ్రామం. యాదనాల కొంరమ్మ, సోమయ్య దంపతులకు 1963 మార్చి 21న ప్రథమ సంతానంగా జన్మించాడు. ప్రభంజన్‌కు ముగ్గురు సోదరులు, ఇద్దరు చెల్లెల్లు ఉన్నారు. తండ్రి సోమయ్య పదేండ్ల క్రితం మృతి చెందారు.

ప్రభంజన్ ఒకటో తరగతి నుంచి టెన్త్ వరకు అమ్మమ్మ ఊరిలోని జఫర్‌గఢ్ మండలం కూనురులో చదివారు. ఇంటర్ నిజామాబాద్, డిగ్రీ, పీజీ ఉస్మానియా వర్సిటీలో పూర్తి చేశారు. విద్యార్థి దశనుంచే ఉద్యమాల్లో పాల్గొన్నారు. ఉన్నత విద్య తర్వాత యూపీఎస్సీ ద్వారా ఇండియన్ ఇన్ఫర్మేషన్ సర్వీస్ (ఐఐఎస్) సాధించారు. 1998లో ఐఐఎస్ అధికారిగా ఆలిండియా రేడియోలో డిప్యూటీ ఎడిటర్‌గా విధులు నిర్వర్తించారు. ఆ తర్వాత జాతీయ ప్లానింగ్ కమిషన్‌లో పీఆర్‌వోగా కొద్దిరోజులు పని చేసి ఉద్యోగానికి రాజీనామా చేశారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నారు. డోలు దెబ్బ, యాదవ ఇంటలెక్చువల్ ఫోరం స్థాపనలో పాల్గొన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య రూపురేఖలను ప్రపంచానికి పరిచయం చేసిన వ్యక్తి ప్రభంజన్ కుమారే. గద్దర్ నడిపించిన జననాట్య మండలిపై ఎంఫిల్ థీసిస్ ప్రజంటేషన్ చేశారు. తెలంగాణ వర్సిటీలో జర్నలిజం విభాగంలో ప్రొఫెసర్‌గా పని చేసి 2017లో వీఆర్ఎస్ తీసుకున్నారు. ప్రభంజన్ కుమార్ అంతర్యం, ప్రభంజన పథం, గొల్ల కుర్మల సంస్కృతి గొప్ప సంస్కృతి, డోలుదెబ్బ, దండోరా, నడుస్తున్న చరిత్ర, కాసుల జ్ఞానం, బహుజన మీడియా లాంటి పుస్తకాలు రాశారు. కొన్ని నెలల క్రితం క్యాన్సర్ బారినపడ్డారు. ప్రముఖ రచయిత, కవి గూడ అంజయ్య సోదరుని కూతురు డాక్టర్ రేఖను వివాహం చేసుకున్నారు. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆయన భౌతిక కాయాన్ని కుటుంబసభ్యులు జనగామ వైద్య కళాశాలకు అప్పగించారు. అంతకుముందు గూడూరు గ్రామంలో బుధవారం అంతిమయాత్ర నిర్వహించారు.

పలువురు ప్రముఖుల నివాళి

ప్రభంజన్ మృతి పట్ల మాజీ సీఎం కేసీఆర్ సంతాపం ప్రకటించారు. ఆయన మరణం సామాజిక ఉద్యమాలకు తీరని లోటన్నారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ప్రభంజన్ భౌతికకాయానికి తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్ పర్సన్ జి.వి. వెన్నెల పూలమాల వేసి నివాళులర్పించారు. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు. మాజీ ఎంపీ రాపోలు ఆనంద భాస్కర్, చెరుకు సుధాకర్, జర్నలిస్టు కదిరే కృష్ణ, బత్తుల సిద్ధేశ్వర్, కవి, రచయిత శంకరమంచి శ్యాంప్రసాద్, రచయిత రాపోలు సత్యనారాయణ, జర్నలిస్టు మార్గం లక్ష్మీనారాయణ, గుమ్మడిరాజుల సాంబయ్య తదితరులు ప్రభంజన్ భౌతికకాయానికి నివాళులర్పించారు.


డీఈవో వాసంతికి వినతిపత్రం అందజేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

'భోజన' కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

వరంగల్ ఎడ్యుకేషన్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బుధవారం తెలంగాణ మధ్యాహ్న భోజనకార్మికుల యూనియన్, సీఐటీయూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో డీఈవో కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ గౌరవ అధ్యక్షురాలు నిడిగొండ రజిత మాట్లాడుతూ గత 20 సంవత్సరాలుగా పని చేస్తున్న కార్మికులకు పని భద్రత కల్పించాలని డిమాండ్‌చేశారు. ఐదు నెలల నుంచి బకాయి వేతనాలు ఇవ్వకుంటే ఏ విధంగా పని చేయాలో చెప్పాలన్నారు. ప్రభుత్వం గ్యాస్ సబ్సిడీ అందజేయాలని, కోడి గుడ్ల బకాయిలు సైతం తక్షణమే అందించాలన్నారు.కార్మికులకు కనీస వేతనంగా రూ. 26 వేలు అందించి ప్రభుత్వ గుర్తింపు కార్డు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని డీఈఓ వాసంతికి అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రధానకార్యదర్శి కె.శాంత, ఎండి.పర్వీన్, జి.లక్ష్మీ, సునీత, మమత, రేవతి, జిజియా తదితరులు పాల్గొన్నారు.


కళాశాలలో నిరసన చేస్తున్న విద్యార్థులు

ఎడ్యుకేషన్ కళాశాలలో విద్యార్థుల నిరసన

సమస్యలు పరిష్కరించాలి డిమాండ్

కేయూ క్యాంపస్ జూలై 16, (ఆంధ్రజ్యోతి) : కేయూ క్యాంపస్ ఎడ్యుకేషన్ కళాశాలలోని విద్యార్థులు కళాశాలలో నెలకున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బీఈడీ, ఎంఈడీ విద్యార్థులు నిరసన చేపట్టారు. కళాశాల వద్ద బైఠాయించారు ఫ్లకార్డులు ప్రదర్శిస్తూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు. గత కొన్ని రోజులుగా కళాశాలలో సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. కళాశాలకు రెగ్యులర్ అధికారులు లేరని ఆందోళన వ్యక్తం చేశారు. తమ వద్దకు వర్సిటీ ఉన్నతాధికారులు వచ్చి సరైన హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఈడీ, ఎంఈడీ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

నానో యూరియాతో సత్ఫలితాలు

ములుగు కలెక్టర్ దివాకర



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ దివాకర

ములుగు కలెక్టరేట్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ రంగంలో నానో యూరియాతో సత్ఫలితాలు పొందొచ్చని కలెక్టర్ టీఎస్.దివాకర అన్నారు. బుధవారం మల్లంపల్లి మండలం రామచంద్రాపురం గ్రామంలోని స్నేహ రైతు ఉత్పత్తిదారుల కంపెనీ లిమిటెడ్ కేంద్రంలో వ్యవసాయశాఖ, ఇఫ్కో సంయుక్త ఆధ్వర్యంలో నానో యూరియా ప్లస్, నానో డీఏపీపై జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. వ్యవసాయ రంగంలో నానో యూరియా విప్లవాత్మకమైన మార్పులు తీసుకువస్తుందని అన్నారు. రైతు శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని నానో సాంకేతికత పరిజ్ఞానంతో మొట్టమొదటిసారిగా యూరియాను ద్రవరూపంలో తీసుకువచ్చిన ఘనత ఓ భారతీయుడని, ఇది దేశానికి గర్వకారణమన్నారు. సత్వర ప్రయోజనం అందించే నానో యూరియా గురించి రైతులకు అవగాహన కల్పించాలన్నారు. నానో యూరియా వాడకంపై రైతులకు అవగాహన కల్పించేందుకు వ్యవసాయ అధికారులు శాస్త్రవేత్తలతో సమావేశాలు నిర్వహించాలన్నారు. నానో యూరియా వాడకం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించాలన్నారు. రైతు శిక్షణ కార్యక్రమాలు, ప్రదర్శన నిర్వహించి నానో యూరియాను ఎలా ఉపయోగించాలో రైతులకు ప్రత్యక్షంగా చూపించాలన్నారు. నానో యూరియా వాడకం వల్ల అధిక దిగుబడి, ఖర్చు తగ్గడం, భూసార పరిరక్షణ, పర్యావరణహితం కలుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి సురేష్‌కుమార్, ఇఫ్కో డీఎం విశాల్‌షిండే, స్నేహ ఎఫ్‌పీవో సీఈవో చాంద్‌పాషా, ఇఫ్కో డైరెక్టర్లు అశోక్, పోరిక ప్రమేలా, కవిత, ఎంపీడీవో హనుమంతరావు, మండల వ్యవసాయ అధికారులు నల్లెల్ల శ్రీధర్, పరమేశ్వర్, రామచంద్రాపూర్ ఏఈవో కావ్య, రైతులు పాల్గొన్నారు.

రైతులకు అవగాహన

టేకుమట్ల(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో నానో యూరియా, డీఏపీపై రైతులకు మండల వ్యవసాయాధికారి కల్యాణి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నానో యూరియా, డీఏపీల వాడకం వల్ల రైతులకు రవాణా ఖర్చులతో పాటు పనిభారం కూడా తగ్గుతుందన్నారు. నానో యూరియా వాడటం వల్ల పెట్టుబడి ఖర్చు తగ్గించుకోవచ్చని సూచించారు. నానో యూరియా లిక్విడ్ రూపంలో అందుబాటులోకి వచ్చిందన్నారు . ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. ఘన రూపంలో ఉండే యూరియా, డీఏపీలతో పోల్చితే అనేక లాభాలు ఉన్నాయని రైతులు గమనించాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు రాహుల్, అరుణ్ రైతులు తదితరులు పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్‌లు మంజూరు చేయాలి



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థులు

వెంకటాపురం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లను మంజూరు చేయాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు బుధవారం జూనియర్ కళాశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రవి మాట్లాడుతూ నూతనంగా మంజూరైన ప్రభుత్వ జూనియర్ కళాశాలకు కొత్త భవనం మంజూరు చేయాలని, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను తక్షణమే విడుదల చేయాలని, విద్యార్థులకు పూర్తిస్థాయిలో పాఠ్యపుస్తకాలు అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ వేణుగోపాల్‌కు అందజేశారు. ఈకార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు సోడి అశోక్, వంశీ పాల్గొన్నారు.

అందుబాటులోకి యూరియా

వాజేడు, జూలై 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతులకు యూరియా అందుబాటులో ఉందని వాజేడు పీఏసీఎస్ చైర్మన్ యగ్గడి అంజయ్య ఒక ప్రకటనలో తెలిపారు. వాజేడులో 40టన్నులు, ధర్మవరం, ప్రగళ్లపల్లిలో 40టన్నుల యూరియా నిల్వలు ఉన్నాయని, రైతులు కొనుగోలు చేసుకోవాలని సూచించారు.

కరకట్ట నిర్మాణంలో నిర్లక్ష్యం వద్దు

బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి



రామన్నగూడెం సమీపంలో కరకట్టను పరిశీలిస్తున్న బీఆర్ఎస్ నేతలు

ఏటూరునాగారం రూరల్, జూలై16, (ఆంధ్రజ్యోతి) : గోదావరి కరకట్ట నిర్మాణం పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని బీఆర్ఎస్ ములుగు జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మినరసింహారావు విమర్శించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి గోదావరి కరకట్టలను ఆయన బుధవారం పరిశీలించారు. పలు చోట్ల ప్రమాదకరంగా మారినకరకట్ల పరిస్థితిని పరిశీలించి జల వనరుల శాఖ అధికారులతో మాట్లాడారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం కరకట్ట నిర్మాణానికి రూ. 137 కోట్లను మంజూరు చేసిందన్నారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పనులను ఇప్పటి వరకు కూడా ప్రారంభించలేదన్నారు. వరద తాకిడి కరకట్ట తెగిపోయే ప్రమాదముందని అన్నారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు సునీల్ కుమార్, మల్లారెడ్డి, ప్రదీప్‌రావు, ఎమ్డీ ఖాజా, తాడూరి రఘు, దన్నపునేని కిరణ్ తదితరులు ఉన్నారు.

వీడిన హత్య కేసు మిస్టరీ

- ఆరుగురిని అరెస్టు చేసిన పోలీసులు
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ

రేగొండ, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : బుగులోని గుట్టల్లో ఇటీవల చోటుచేసుకున్న హత్య కేసు మిస్టరీని పోలీసులు ఛేదించారు. మృతుడు రెండో భార్యతోపాటు మరో ఐదుగురిని అరెస్టు చేశారు. భార్యపై అను మానం పెట్టుకొని ఆమెను నిత్యం వేధించడమే భర్త హత్యకు కారణ మైందని డీఎస్పీ సంపత్‌రావు తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో బుధ వారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసు పూర్వపరాలను ఆయన వివరించారు.

భూపాలపల్లి మండలంలోని కొంపల్లి గ్రామానికి చెందిన పర్శ రవి మొదటి భార్యకు విడాకులిచ్చి అప్పటికే ఇద్దరు పిల్లలు ఉన్న రేణుకను వివాహం చేసుకున్నాడు. వీరి వైవాహిక జీవితం సజావుగానే ఉన్నా కొన్నేళ్లుగా రేణుకపై అనుమానం పెట్టుకున్న రవి నిత్యం ఆమెను వేధించేవాడు. పలుమార్లు పెద్దమనుషుల సమక్షంలో పంచాయితీ చేసి నా రవిలో మార్పు రాలేదు. దీంతో రేణుక, తన మొదటి భర్త కుమారుడు శ్రీకర్, అదే గ్రామానికి చెందిన శ్రీపాల్‌తో కలిసి రవి హత్యకు ప్లాన్ చేసింది. దీని ప్రకారం బొమ్మకంటి చందర్, సందీప్. నరేష్ అనే వ్యక్తులకు శ్రీకర్ సుపారీ ఇచ్చాడు. పథకం ప్రకారం జూలై 10న రవి మొదటి భార్య చిన్న కొడుకుకు ఉద్యోగం ఇప్పిస్తామని రవిని నమ్మించారు. ఇందుకు మాట్లా డుదామని చెప్పి శ్రీకర్, శ్రీపాల్, చందర్, సందీప్, నరేష్ కారులో అతడిని బయటకు తీసుకెళ్లారు. కొంపల్లిలోని బార్ షాపులో రవికి అధికంగా మద్యం తాగించారు. అనంతరం నిర్మానుష్యంగా ఉన్న పాండవుల గుట్ట ప్రాంతానికి తీసుకెళ్లారు. రవి కారులో కూర్చొని ఉండగానే వెనకాల నుంచి తాడుతో ఉరి వేసి హత్య చేశారు. అనంతరం మృతదేహాన్ని చెట్ల పొదల్లో వేసి హనుమకొండకు పారిపో యారు. రవి మొదటి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేస్తున్న క్రమంలో రేగొండ మండల కేంద్రంలోని చెక్‌పోస్టు వద్ద తనిఖీ చేస్తుండగా నిందితులు పట్టుబడ్డారని డీఎస్పీ తెలిపారు. రేణుక, శ్రీకర్, శ్రీపాల్, చందర్, సందీప్, నరేష్‌ను అరెస్టు చేసి హత్యకు ఉపయోగించిన తాడును, వాహనాలను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. హత్య కేసును ఛేదించిన సీఐ మల్లేష్‌యాదవ్, ఎస్సై సందీప్ కుమార్‌ను డీఎస్పీ అభినందించారు.

పరిజ్ఞానానికి పరీక్ష

లైసెన్స్‌డ్ సర్వేయర్ల నియామకానికి కసరత్తు

వెంకటాపూర్, జూలై 16, (ఆంధ్రజ్యోతి): లైసెన్స్‌డ్ సర్వేయర్ల నియామకానికి ప్రభుత్వం ఆచీతూచి వ్యవహరిస్తోంది. పరిజ్ఞానం ఉన్నవారినే నియమించాలని నిర్ణహించింది. ఇందుకు పరీక్ష నిర్వహణకు ఏర్పాట్లు చేస్తోంది. భూభారతి చట్టం అమలులో భాగంగా గ్రామాల్లో భూసమస్యల పరిష్కారానికి ప్రైవేట్ లైసెన్స్‌డ్ సర్వేయర్లను వినియోగించుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం నిర్ణహించిన విషయం విదిమే. పాలిటెక్నిక్, ఐటీఐ, సివిల్, బీటెక్ అభ్యసించిన వారు ఆసక్తి చూపగా అభ్య ర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిం చింది. ములుగు జిల్లాలో అర్హులను గుర్తించేందుకు 50 రోజుల పాటు శిక్షణ అందిస్తోంది. శిక్షణ కార్యక్రమం ముగింపు దశకు చేరుకోగా తరగతి గదుల్లో థియరీ, క్షేత్రస్థాయిలో శిక్షణ పొందిన అభ్యర్థులకు మూడు రోజులు పరీక్షలు నిర్వహించి ఉత్తీర్ణులైన వారికి లెసెన్సు జారీ చేయాలని అధి కారులు భావిస్తున్నారు.

మూడు రోజులు పరీక్షలు

ఈనెల 26 నాటికి 50 రోజుల శిక్షణ ముగియనుంది. 27, 28, 29, తేదీల్లో పరీక్షలు నిర్వహించనున్నారు. 27న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు థియరీలో పరీక్ష ఉంటుంది. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్లాటింగ్, కాలిక్యులేషన్‌పై పరీక్ష నిర్వహిస్తారు. 28, 29వ తేదీల్లో క్షేత్రస్థాయి అభ్యర్థులను తీసుకెళ్లి కొంత భూవిస్తీర్ణం అప్పగించి కొలత వేసి ప్లాటింగ్ చేయడం, కాలిక్యులేషన్ చేసే పరీక్ష నిర్వహించనున్నట్లు ములుగు జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ సర్వే అండ్ ల్యాండ్ రికార్డు అధికారి పచ్చిక దేవరాజు వివరించారు. అభ్యర్థులను పరీక్షలకు అనుమతింటడం, అనంతరం ఎంపిక చేయడంతోపాటు వారిని మండలాల వారీగా ఎలా ఉపయోగించుకోవాలనే అంశాలపై ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు అందాల్సి ఉందన తెలిపారు.

నాలేడ్జి ఉంటేనే నియామకం!

శిక్షణ పొందుతున్న వారిలో పరిజ్ఞానం, ప్రతిభ ఉన్న వారినే కాంట్రాక్టు పద్ధతిన నియమించనున్నారని తెలుస్తోంది. ములుగు జిల్లాలో 174 గ్రామాలు ఉండగా మెదటి విడుతలో 80 మంది, రెండో విడుతలో 80 మంది.. ఇలా మొత్తం 160 మంది శిక్షణ పొందుతున్నారు. ఇటీవల రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మండలానికి ముగ్గురు సర్వేయర్లను తీసుకుంటామని ప్రకటించిన విషయం తెలిసిందే. ఈక్రమంలో మిగితా సర్వేయర్లను సమగ్ర భూసర్వే వరకే వినియోగిస్తాని తెలుస్తోంది. ప్రతిభ ఉన్న వారికి అవకాశాలు ఉంటాయని స్పష్టమవుతుంది. దాదాపు ములుగు జిల్లాలో శిక్షనలో ఉన్న 160 మంది బీటెక్, ఎంటెక్, ఎంబీఏ, డిగ్రీ చేసిన అభ్యర్థులు ఉన్నారని తెలుస్తోంది.

వివాహ వేడుకలను హాజరైన మంత్రి సీతక్క

ఏటూరునాగారం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కె-మార్ట్ యజమాని సర్కార్ కుమారుడి వివాహ వేడుకలకు రాష్ట్ర మంత్రి సీతక్క హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. మండల కేంద్రంలోని ఓ కల్యాణ మండపంలో బుధవారం పెళ్లి జరిగింది. మంత్రి వెంట కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చిటమట రఘు, మార్కెట్ కమిటీ చైర్మన్ రేగా కల్యాణి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ డైరెక్టర్ వసంత శ్రీనివాస్ యాదవ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇర్సవడ్ల వెంకన్న ఉన్నారు.

ఇసుక దందాకు కేరాఫ్ కాంగ్రెస్ : బీఆర్ఎస్

టేకుమట్ల, జూలై 16 (ఆంధ్రజ్యోతి): టేకుమట్ల మండలంలో అక్రమ ఇసుక దందాకు కేరాఫ్ కాంగ్రెస్ నాయకులేనని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సట్ల రవి ఆరోపించారు. మండల కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇసుక దందాకు పాల్పడే కాంగ్రెస్ నాయకులకు మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డిపై ఆరోపణలు చేసే నైతికత లేదన్నారు. వెంకటరమణారెడ్డి ఏనాడూ ఇసుక దందాను ప్రోత్సహించలేదని, ఆయన గురించి అసత్య ప్రచారాలు చేస్తే సహించేది లేదన్నారు. ఇసుక దందా ఎవరి హాయంలో అడ్డగోలుగా నడుస్తుందో ప్రజలు గమనిస్తున్నారన్నారు. ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక తరలింపు పేరుతో అడ్డగోలుగా ఇసుకను అక్రమంగా తరలిస్తూ జేబులు నింపుకుంటున్న కాంగ్రెస్ నాయకులకు ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. విలేకరుల సమావేశంలో మాజీ ఎంపీటీసీ పింగిళి వెంకటేశ్వర్లు, బందెల నరేష్, నల్లబెల్లి రవీందర్, మారం లింగారెడ్డి, రేణుకుంట్ల సమ్మయ్య, వసంతరావు, ఆకోజ్ వరదచారి, గువ్వాడి లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

ఫర్టిలైజర్ వ్యాపారుల కార్యవర్గం ఎన్నిక

మహదేవపూర్ రూరల్, జూలై 16(ఆంధ్రజ్యోతి) : మండల ఫెర్టిలైజర్ వ్యాపారుల నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కట్కం అధ్యక్షత బుధారం జరిగిన సమావేశంలో కార్యవర్గాన్ని ఖరారు చేశారు. మండల అధ్యక్షుడిగా కడార్ల శంకర్ పటేల్, ఉపాధ్యాక్షులుగా సామ బాల నాగేందర్, ప్రధాన కార్యదర్శిగా బాసాని కృష్ణమూర్తి, కోశాధికారిగా ఆకుతోట రాజ్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

పీఎస్ భవనాన్ని నిర్మించాలి : పీఆర్టీయూ



ప్రైవేట్‌గదిలోని పాఠశాలలో ఉపాధ్యాయులతో సంఘం నేతలు

కాటారం, జూలై 16(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం పరిధిలోని ఎస్సీ కాలనీలో పిల్లర్ల స్థాయిలో ఉన్న ప్రాథమిక పాఠశాల భవనాన్ని వెంటనే నిర్మించాలని పీఆర్టీయూ మండల ప్రధాన కార్యదర్శి అనపర్తి తిరుపతి కోరారు. పీఆర్టీయూ మండలశాఖ ఆధ్వర్యంలో పాఠశాలను తిరుపతి బుధవారం సందర్శించారు. మన ఊరు-మన బడి పథకంలో భాగంగా శిథిలావస్థకు చేరిన పాఠశాల భవనాన్ని కూల్చి భవన నిర్మాణం ప్రారంభం జరిగిందన్నారు. రెండేళ్లు దాటినా భవనం పూర్తికాక 26మంది విద్యార్థులు, ఇద్దరు ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారని, అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని కోరారు.

విద్యుత్ డివిజన్ ఏర్పాటు హర్షణీయం

కాటారం, జూలై 16(ఆంధ్రజ్యోతి): కాటారం కేంద్రంగా నూతన విద్యుత్ డివిజన్(ఆపరేషన్స్) ఏర్పాటు కానుండటం హర్షణీయమని మాజీ ఎంపీపీ వంతకాని సమ్మయ్య, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు చీమల సందీప్ అన్నారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ విద్యుత్ సమస్యలను పరిష్కరించడానికి, నాణ్యమైన గృహ, వ్యవసాయ విద్యుత్ సరఫరా కోసం విద్యుత్ డివిజన్ ఏర్పాటుకు కృషి చేసిన రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు ధన్యవాదాలు తెలిపారు. విద్యుత్‌శాఖ ఉద్యోగులు పెరిగి వినియోగదారులకు ఇబ్బందులు తప్పుతాయన్నారు.

అభివృద్ధి పథంలో నడుస్తున్నాం..

(5వ పేజీ తరువాయి)

ఏర్పాటు చేశాం. లక్నవరంలో కొత్త ఐలాండ్‌ను ఏర్పాటు చేయించాం. రామప్పలో సాస్కి స్కీం కింద రూ. 75 కోట్లు మంజూరుకు కృషి చేశాం. వర్షాకాలం నేపథ్యంలో బ్లాక్ బెర్రీ ఐలాండ్‌ను కొద్దిరోజులు మూసివేశాం. సెప్టెంబరులో తిరిగి ప్రారంభిస్తాం.

ప్రశ్న: ప్రజలు రవాణా పరమైన కష్టాలు ఎదుర్కోకుండా ఏమైనా చర్యలు చేపట్టారా?

జవాబు: రాష్ట్ర ప్రభుత్వం సహకారంతో మంగపేటలో నూతన బస్టాండ్, ఏటూరునాగారంలో ఆర్టీసీ బస్‌డిపో, జిల్లా కేంద్రంలో అధునాతనమైన బస్టాండ్‌ను ఏర్పాటు చేస్తున్నాం. దీంతో ప్రజలకు త్వరలోనే రవాణా కష్టాలు తీరనున్నాయి.

ప్రశ్న: విద్యావ్యవస్థపై మీరెలాంటి దృష్టి పెట్టారు?

జవాబు: జిల్లా విద్యావ్యవస్థపై ప్రత్యేక చొరవ తీసుకుంటున్నాం. ఇంటర్‌లో రాష్ట్రంలో జిల్లా మొదటి స్థానంలో ఉంది. పదో తరగతి ఫలితాల్లో ఎనిమిదో స్థానంలో నిలిచింది. కన్నాయిగూడెం మండలంలో కంటైనర్ పాఠశాలను ఏర్పాటు చేశాం. జిల్లాకు ట్రైబల్ యూనివర్సిటీ మంజూరైంది. దీని ఏర్పాటుకు భూమి కేటాయింపు సమస్య ఉంటే పరిష్కరించాం. ఈ సంవత్సరం పనులు ప్రారంభమయ్యేలా కృషిచేశాం. అలాగే మెడికల్ కళాశాలను ప్రారంభించుకున్నాం. విద్యార్థులు ఇంగ్లిష్ భాషలో నైపుణ్యం పొందేలా దిశా ఫౌండేషన్ సౌజన్యంతో 54 ప్రాథమిక పాఠశాలను ఎంపిక చేసి 108 మంది ఉపాధ్యాయులకు శిక్షణ ఇప్పించాం.

ప్రశ్న: జిల్లా సంక్షేమ పథకాల అమలు ఎలా ఉంది?

జవాబు: సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేసేందుకు సమగ్ర కుటుంబ సర్వే నిర్వహించాం. క్యాస్ట్, ఎకనామికల్ సోషియో సర్వే నిర్వహించాం. పంచాయతీరాజ్, రెవెన్యూ తదితర శాఖల సమన్వయంతో టీం వర్క్ చేస్తూ ప్రభుత్వం అందించే 200 యూనిట్ల ఉచిత కరెంటు, ఇందిరమ్మ ఇళ్లు, సన్నబియ్యం, రూ. 500కే గ్యాస్ సిలిండర్ వంటి అన్ని పథకాలను అర్హులైన వారికి అందేలా చూస్తున్నాం. ప్రజలకు ప్రభుత్వం ఇస్తున్న పథకాల్లో ఏమైన సమస్యలు ఉంటే గ్రీవెన్స్ ద్వారా తెలుసుకుని పరిష్కరిస్తున్నాం. ప్రస్తుతం అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు ఇస్తున్నాం. ఇటీవల ప్రైవేటు విత్తన కంపెనీల చేతుల్లో మోసపోయిన 671 మంది అన్నదాతలకు దేశంలో ఎక్కడా లేని విధంగా రూ. 3.81 కోట్ల నష్టపరిహారాన్ని మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, సీతక్క చేతుల మీదుగా ఇప్పించాం. భూ భారతి వచ్చినప్పటి నుంచి కొన్ని భూసమస్యలు కింది స్థాయిలో తహసీల్దార్, ఆర్డీవో స్థాయిలోనే పరిష్కారమవుతున్నాయి.

ప్రశ్న: ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కోవడానికి ఎలాంటి చర్యలు చేపట్టారు?

జవాబు: వర్షాకాలం నేపథ్యంలో ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కోవడం కోసం ముందస్తు కార్యాచరణ రూపొందించాం. ముంపు ప్రాంతాలను ఎప్పటికప్పుడు గమనిస్తూ ప్రజలను అప్రమత్తం చేస్తున్నాం. ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్, డీడీఆర్ఎఫ్ బృందాలను అందుబాటులో ఉంచాం. బోట్లను సిద్ధంచేశాం. 15వేల మంది ఆవాసం పొందేలా 80 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశాం. వర్షాలు కురిసినప్పుడు కూలిపోయే స్థితిలో 900 ఇళ్లు ఉన్నట్లు గుర్తించాం. వాటిలో నివసిస్తున్నవారిని అప్రమత్తం చేశాం. గర్భిణుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టాం.

ప్రశ్న: నిరుద్యోగుల కోసం ఏమైనా కార్యక్రమాలను చేపడుతున్నారా?

జవాబు: జిల్లాలోని నిరుద్యోగులకోసం స్కిల్ సర్వే చేపట్టి టాస్క్ సెంటర్‌ను ఏర్పాటు చేశాం. అందులో శిక్షణ ఇప్పించి, వారి నైపుణ్యానికి తగిన ఉద్యోగం వచ్చేలా ఏర్పాటు చేశాం. ఇప్పటి వరకు 80 మందికి శిక్షణ ఇప్పిచ్చాం. అందులో 51 మందికి జాబ్ ఆఫర్ వచ్చింది. మరో 23 మంది షార్ట్ లిస్ట్ అయ్యారు. వారిని సెకండ్ రౌండ్ ఇంటర్వ్యూకు పిలిచారు.

ప్రశ్న: మేడారం అభివృద్ధిపై ఎలాంటి దృష్టి పెట్టారు?

జవాబు: రానున్న మహా జాతరకు అధిక సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉంది. వారికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా అన్ని శాఖలను సమన్వయ పరిచి పనిచేస్తాం. ప్రధానంగా క్యూలైన్లన విశాలంగా చేసి భక్తులు దర్శనంచేసుకునేలా ఏర్పాట్లు చేస్తాం. మాస్టర్ ప్లాన్ ప్రకారం మేడారంలో పనులు ప్రారంభించేందుకు అన్ని ఏర్పాట్లు చేపడుతున్నాం. ఆదివాసీల సంస్కృతిని కాపాడుతూ మేడారం అభివృద్ధికి కృషిచేస్తాం.

సాగుతున్న సర్వే పనులు

మల్హర్, జూలై 16(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన తాడిచర్ల నుంచి కిషన్‌రావుపల్లి మీదుగా భూపాలపల్లికి రోడ్డు నిర్మాణానికి సంబంధించిన సర్వే పనులు సాగుతున్నాయి. కొయూర్ ఫారెస్టు రేంజర్ రాజేశ్వర్‌రావు ఆధ్వర్యంలో సిబ్బంది హద్దులను రెండు వైపులా ఏర్పాటు చేస్తున్నారు. అటవీలో ఆరు మీటర్ల వెడెల్పుతో రోడ్డు నిర్మాణం చేపట్టనున్నారు. అలాగే రోడ్డు నిర్మాణంలో పోతున్న చెట్లు ఏమిటి.. అవి ఏ రకం, వాటి సైజులు ఎంత ? అనే అంశాలపై సర్వే చేస్తున్నారు. ఈ రోడ్డు నిర్మాణంలో కొంత భాగం భూపాలపల్లి రేంజ్, కొంత భాగం కొయ్యూర్ రేంజ్‌కు రావడంతో రెండు వైపులా అటవీశాఖ అధికారలు సర్వే చేపడుతున్నారు. సెక్షన్ ఆఫీసర్ లక్ష్మణ్, బీట్ ఆఫీసర్లు పాల్గొంటున్నారు.

బీఆర్ఎస్ యూత్ మండల అధ్యక్షుడిగా అక్రమ్

టేకుమట్ల, జూలై 16 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ యువజన విభాగం మండల అధ్యక్షుడిగా వెలిశాల గ్రామానికి చెందిన ఎం.డి.అక్రమ్ ఎన్నికయ్యారు. ఆ పార్టీ మండల అధ్యక్షుడు సట్ల రవి ఈ మేరకు బుధవారం నియమాక పత్రాన్ని అందజేశారు. బీఆర్ఎస్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి, మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి ఆదేశాల మేరకు అక్రమ్‌ను యూత్ మండల అధ్యక్షుడిగా నియమించినట్లు తెలిపారు.

ట్రాలీ వాహనాల యూనియన్ ఎన్నిక

చిట్యాల, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : చిట్యాల లక్ష్మీనరసింహ మినీ ట్రాలీ వాహనాల యూనియన్‌ను బుధవారం మండల కేంద్రంలో ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా అంబాల రాజు, అధ్యక్షుడిగా వేముల రాజు, ప్రధాన కార్యదర్శిగా మోత్కూరి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా పిట్టల నాగరాజు, కోశాధికారిగా నిమ్మల నరేష్, సభ్యులుగా తాటిపెల్లి శ్రీనివాస్, టేకు వేణు, తాటికంటి రాజు, సాదుల తిరుపతి, ఏకు కిషన్, చేర్ల చందు, మోటం రాజు, అనిల్, శ్రీకాంత్‌ను ఎన్నుకున్నారు. ఈకార్యక్రమంలో విజేందర్, మల్లేష్, ప్రశాంత్, రమేష్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

వృథాగా పోతున్న భగీరథ నీరు

మల్హర్, జూలై 16(ఆంధ్రజ్యోతి) : మిషన్ భగీరథ మెయిన్‌లైన్ ధ్వంసం కావడంతో నీరంతా వృథాగా పోతుంది. మండలంలోని మల్లారం నుంచి తాడిచర్లకు వచ్చే మార్గంలో పలు చోట్ల మెయిన్ పైప్‌లైన్ పగలడంతో గ్రామాలకు సక్రమంగా నీరందడం లేదు. వారం రోజుల నుంచి ఇదే పరిస్థితి ఉన్నా గ్రిడ్ అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో తాడిచర్ల, మల్లారం, చిన్నతూండ్ల, దబ్బగట్టు గ్రామాల ప్రజలు నీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. పైప్‌లైన్‌కు మరమ్మత్తులు చేపట్టకపోవడంతో నీరంతా కలుషితమవుతోంది. దీంతో వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, అధికారులు పైప్‌లైన్‌కు మరమ్మతులు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

మొక్కలు నాటిన డీఎస్పీ

మల్హర్, జూలై 16(ఆంధ్రజ్యోతి) : వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా కొయ్యూర్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో బుధవారం కాటారం డీఎస్పీ సూర్యనారాయణ మొక్కలు నాటా రు. ప్రతి ఒకరూ విధిగా మొక్కలు నాటాలన్నారు. పోలీస్ స్టేషన్ ఆవరణలో సుమారు వంద మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో సీఐ నాగార్జున, ఎస్సై నరేష్, సిబ్బంది పాల్గొన్నారు.

మారిన విద్యుత్ అధికారుల ఫోన్ నెంబర్లు

కాటారం, జూలై 16(ఆంధ్రజ్యోతి): విద్యుత్ శాఖ అధికారులు, సబ్ స్టేషన్లకు సంబంధించిన ఫోన్ నెంబర్లు మారినట్లు కాటారం ఏడీఈ నాగరాజు, ఏఈ ఉపేందర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం గతంలో ఉన్న వాటి స్థానంలో నూతన నెంబర్లు కేటాయించిందని, విద్యుత్ విని యోగదారులు గమనించాలని కోరారు. డివిజన్ పరిధిలో ఏడీఈ నెంబర్ 8712487049, కాటారం ఏఈ-8712487050, లైన్ ఇన్‌స్పెక్టర్-8712487004, కాటారం లైన్‌మెన్-8712487002, చింతకాని ఎల్ఎం-8712487001, గంగారం ఎల్ఎం-8712487003, కాటారం సబ్‌స్టేషన్-8712484326, ధన్వాడ సబ్‌స్టేషన్- 8712486738, గంగారం సబ్‌స్టేషన్-8712487005, దామెరకుంట సబ్‌స్టేషన్-8712486737 నెంబర్లు అందుబాటులో ఉంటాయని అధికారులు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

ఊరంతా ఒక్కటే కుటుంబంగా వనభోజనాలకు

కొత్తగూడ, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : ఆ ఊరంతా ఒక్కటే కుటుంబంగా.. వన భోజనాలకు తరలివెళ్లడం ఆ ఊరి ప్రత్యేకత. మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండల కేంద్రంలోని బూరుగుగుంపు గ్రామంలో బుధవారం ఆషాడం వంటలకు అడవికి తరలివెళ్లారు. గ్రామంలో ఒక ప్రత్యేకత ఉంది.. గత కొన్ని సంవత్సరాలుగా గ్రామస్థులు వనభోజనాలకు వెళితే గ్రామపెద్దలే ఇంటింటికి ఒక కోడి, సామగ్రి అందజేస్తారు. బుధవారం వనభోజనాలకు వెళుతున్న గ్రామస్థులకు గ్రామపెద్దలు కోళ్లను పంపిణీ చేశారు. అందుకు కావాల్సిన డబ్బులను సంవత్సరం కాలంలో వివిధ రూపాలలో సేకరించి గ్రామపెద్దల వద్ద నిల్వ చేస్తారు. వనభోజనాల సమయంలో ఇలా ఉపయోగిస్తారు.

ఎన్నికల కోసమే బీఆర్ఎస్ డ్రామాలు

మార్కెట్ కమిటీ చైర్మన్ కిష్టయ్య

రేగొండ, జూలై 16(ఆంధ్రజ్యోతి) : రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల కోసమే బీఆర్ఎస్ నాయకులు డ్రామాలు ఆడుతున్నారని భూపాలపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ కిష్టయ్య విమర్శించారు. మండల కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకనే మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అవాకులు చెవాకులు పలుకుతున్నారని మండిపడ్డారు. స్థానిక ఎన్నికల్లో లబ్ధిపొందేందుకే విమర్శలు చేస్తున్నారని దుయ్యబట్టారు. రెండేళ్లలోనే కాంగ్రెస్ ప్రభుత్వం నాలుగు గ్యారెంటీ పథకాలను అమలు చేసిందని అన్నారు. అధికారంలో ఉన్నప్పుడు ప్రజలకు కోసం బీఆర్ఎస్ చేసిందేమిటో చెప్పాలని ప్రశ్నించారు. విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఇప్పకాయల నర్సయ్య, పున్నం రవి, ఓంప్రకాశ్, పట్టెం శంకర్, గండి తిరుపతి పాల్గొన్నారు.